నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

డీఈవో యాదయ్య

భీమిని పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కన్నెపల్లి , సెప్టెంబరు 11 : ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేసినా, సమయ పాలన పాటించకపోయినా చర్యలు తప్పవని డీఈవో యాదయ్య హెచ్చరించారు. గురువారం భీమిని మండల కేంద్రంలోని ప్రాథమిక, జడ్పీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ, స్వాతి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రమేశ్ ఆలస్యంగా రావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం పెద్దపేట, మామిడిగూడ, భీమిని ఎస్సీ కాలనీల్లోని పాఠశాలలను, భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారి చౌదరి ఉన్నారు.

సీఎమ్మార్ లక్ష్యం పూర్తవ్వాలి

కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

గణనాథుల నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 12 : సీఎమ్మార్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా స్పష్టం చేశారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పెద్దవాగుకు వెళ్లి గణనాథుల నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆపై సర్‌సిల్క్ ఓల్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీఐ శంకరయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- తిర్యాణిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణ లక్ష్మి చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి, సెప్టెంబర్ 12 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 62 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద యువతుల పెళ్లిళ్లను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పిందని మండిపడ్డారు. రుణ మాఫీపై ఆంక్షలు పెట్టి రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిర్యాణి నుంచి త్రీ ఇంక్లైన్ వరకు బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. అవసరమైతే మరో రూ. 10 లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. మంగీ, గుండాల, గోపెర, కౌతగాం గ్రామాల్లో రోడ్ల అనుమతులు, నిధుల మంజూరుకు నివేదికలు పంపించామన్నారు. మండల కేంద్రం లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా రూ.3 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని 30 పడకల దవాఖానలో మరో వైద్యుడిని నియమించేలా కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో వేముల మల్లేశ్, ఇన్‌చార్జి తహసీల్దార్ వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ కోవ పార్వతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, మల్లేశ్, రమేశ్‌గౌడ్, కుర్సెంగ బాదిరావు, మహిళా నాయకులు ముక్కెర సరిత, వెడ్మ కమల, సుజాత పాల్గొన్నారు.

తులం బంగారం ఇవ్వాలి

రెబ్బెన, సెప్టెంబర్ 12 : కల్యాణ లక్ష్మి పథకం ద్వారా నగదుతో పాటు తులం బంగారం అందించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం రెబ్బెన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 77 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. ఇక్కడ తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఆర్ఐ ప్రేంకిరణ్ ఉన్నారు.

రెబ్బెనలో కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఇప్పట్లో కరకట్టలు కష్టమే..!

మంచిర్యాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- జిల్లా అధికారులను నివేదిక కోరిన హైడ్రాలజీ డిపార్ట్‌మెంట్
- రెండు.. మూడేళ్లు పట్టే అవకాశం
- పక్కా ప్లానింగ్ ప్రకారం చేయకుంటే ఇబ్బందులు తప్పవంటున్న ఇరిగేషన్ అధికారులు
- ప్రత్యేక శ్రద్ధ పెడితే తప్ప సాధ్యం కాని పరిస్థితి

మంచిర్యాల, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గోదావరి వరద ముప్పు నుంచి మంచిర్యాల పట్టణాన్ని కాపాడేందుకు నిర్మించాలనుకున్న కరకట్టలు ఇప్పట్లో కష్టమేనని స్పష్టమవుతున్నది. పూర్తిస్థాయి సర్వే చేసి, రెండు మూడేళ్లు సీరియస్‌గా పనిచేస్తే తప్ప అది సాధ్యం కాదని స్వయంగా యంత్రాంగమే చెబుతున్నది.

యేటా వర్షాకాలం వచ్చిందంటే చాలు మంచిర్యాల జిల్లా కేంద్రానికి వరద ముప్పు పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో కరకట్టలు నిర్మించి తమకు రక్షణ కల్పించాలని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గత ఎన్నికల్లో ఇదే ప్రధాన హామీగా రాజకీయ పార్టీలు ప్రచారం చేశాయి. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరకట్టల నిర్మాణానికి కృషి చేశారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించి, అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యే పీఎస్సార్ సైతం కరకట్టల నిర్మాణంపై హామీ ఇచ్చారు. దీంతో ఏ పార్టీ గెలిచినా కరకట్టలు కట్టడం అనివార్యమైన అంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌లో కొంత డబ్బులు కేటాయించడంతో ఆశలు చిగురించాయి. కాకపోతే గోదావరి వరద పట్టణంలోకి రాకుండా కరకట్టలు నిర్మించడం సులభమయ్యే పని కాదని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి.

నివేదిక కోరిన హైడ్రాలజీ విభాగం

కరకట్టల నిర్మాణానికి అంచనాలు తయారు చేసేందుకు ఇరిగేషన్‌శాఖలో హైడ్రాలజీ విభాగం జిల్లా అధికారులను నివేదిక కోరింది. మంచిర్యాల ఎగువన గుడిపేటలో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటి విడుదల సామర్థ్యం ఎంత, ఇప్పటి వరకు వచ్చిన అత్యధిక వరద ఎంత.. వరద వస్తే పట్టణం మునగాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుంది. గోదావరి వరద ఎంత ఎత్తులో వస్తే రాళ్లవాగు వరద వెనక్కి వెళ్తుంది. రాళ్లవాగుకు వరద ఎక్కడ నుంచి వస్తుంది. పిల్లకాలువలు ఎక్కడెక్కడ వచ్చి కలుస్తాయి. కరకట్టలు కడితే క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద గోదావరిలోకి రావడం ఎలా.. దాని కోసం ఏం చేస్తే బాగుంటుంది. రాళ్లవాగులో సిల్క్ ఫ్యాక్టర్స్ ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఇలా అనేక అంశాలపై సమగ్ర రిపోర్టు కోరింది. ఈ వివరాలన్నీ జిల్లా ఇరిగేషన్ శాఖనుంచి అందజేసే పనిలో ప్రస్తుతం జిల్లా అధికారులు ఉన్నారు. ఈ రిపోర్టు వెళ్లాక హైదరాబాద్ నుంచి హైడ్రాలజీ డిపార్ట్‌మెంట్ మంచిర్యాలకు వచ్చి గోదావరి, రాళ్లవాగు బ్యాక్‌వాటర్‌పై పూర్తిస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితేనే కరకట్టల తుది డిజైన్ రూపొందించడం సాధ్యమవుతుందని అధికారులు అంటున్నారు.

10 లక్షల క్యూసెక్కులు దాటితేనే సమస్య

పట్టణానికి ఎగువన ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ డిస్చార్జి కెపాసిటీ(నీటి విడుదల సామర్థ్యం) 20 లక్షల క్యూసెక్కులు. కానీ ఆ మొత్తంలో వరదలు వదిలే అవకాశం లేదు. 2021-22లో ఎల్లంపల్లి నుంచి 13 లక్షల క్యూసెక్కుల వరద వదిలారు. వందేళ్ల చరిత్రలో అదే అత్యధికం అని అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలోనే మంచిర్యాల పట్టణం రాళ్లవాగు కారణంగా ముంపునకు గురైంది. గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు అప్పుడు కనిపించాయి. 2023లో 9 లక్షల క్యూసెక్కులు వదలగా, పట్టణంలో కొన్ని ప్రాంతాల్లోకి మాత్రమే వరద చేరింది. ఎన్టీఆర్ నగర్, రాంనగర్, సాయికుంట, ఎల్ఐసీ కాలనీల్లో కొంత వరకు ఇబ్బంది వచ్చింది. ఈ లెక్కన 10 లక్షల క్యూసెక్కులు దాటితేనే వరద ముంపు సమస్య వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైడ్రాలజీ విభాగానికి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని, జిల్లా అధికారులు ఇచ్చిన రిపోర్టును పరిశీలించి హైదరాబాద్ నుంచి ప్రత్యేక టీమ్ వచ్చి సర్వే చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. తక్కువలో తక్కువ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ వర్క్ మీదే మొత్తం డిపార్ట్‌మెంట్ పనిచేసినా చాలా సమయంలో పడుతుందని చెబుతున్నారు. హడావుడిగా నిర్మాణం చేస్తే కరకట్టలతో ఎక్కువ సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ లెక్కన మంచిర్యాల కరకట్టల సర్వే జరిగి, పనులు పూర్తి చేయాలంటే కనీసం రెండు.. మూడేళ్ల సమయం పట్టొచ్చని అధికారులు అంటున్నారు. అధికార పార్టీ లీడర్లు ఈ విషయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరగా పూర్తయ్యేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మహిళల ఉపాధికి ప్రాధాన్యం

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట : ఇందిరా మహిళా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 12 : మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట పట్టణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం ఐదు క్యాంటీన్‌లు మంజూరయ్యాయని, ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయం వద్ద ఇటీవల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణంలో కూడా ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం క్యాంటీన్‌లు, మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేయడమేగాక స్కూల్ యూనిఫాంల కుట్టు పని కూడా అప్పగిస్తున్నట్లు చెప్పారు. అంతకు మందు పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో మిల్క్ పార్లర్‌ను కూడా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, అడిషనల్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి స్వప్న, ఎంపీడీవో సరోజ, ఎంపీవో శ్రీనివాస్, ఎపీవో వెంకటరమణ, ఎపీవో విజయలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీపై సమావేశం

నస్పూర్, సెప్టెంబరు 12 : మహిళా సంక్షేమంలో భాగంగా గ్యాస్ రాయితీ కల్పించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, డీపీవో వెంకటేశ్వర్ రావు, జడ్పీ సీఈవో గణపతితో కలిసి గ్యాస్ రాయితీపై సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లకు గ్యాస్ రాయితీ పత్రాలు అందించారు. గ్యాస్ సిలిండర్ పొందిన నాలుగు రోజుల్లో రాయితీ డబ్బులు జమ కాని పక్షంలో వివరాల కోసం 1967, 180042500333 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి

కాసిపేట, సెప్టెంబర్ 12 : మంచిర్యాలను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కాసిపేట మండలం ధర్మారావుపేట, మల్కపల్లి, దేవాపూర్ గ్రామాల్లో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ సఖీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులను 100 రోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, డివిజనల్ పంచాయతీ అధికారి సప్టర్ అలీ, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, సెక్టర్ అధికారి సత్యనారాయణమూర్తి, లయన్స్ క్లబ్ సఖీ అధ్యక్షుడు బండ శాంకరి, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, ఎర్ర సువర్ణ, కొండు జనార్దన్, కందుల తిరుపతి, సుమన్ సమన్వయకర్తలు సంధ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో సేవల గురించి అడుగుతున్న కలెక్టర్

జ్వరాల నియంత్రణకు వైద్య శిబిరాలు

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కెరమేరి,సెప్టెంబర్ 12 : సీజనల్ వ్యాధులు, విషజ్వరాలను నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం కొఠారి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో తుకారాం భట్, డీపీవో భిక్షపతి గౌడ్‌తో కలిసి సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలని, వైద్య పరీక్షలు నిర్వహించి తగు చికిత్స అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువల్లో పూడిక లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ రాయితీ ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో ఆజాద్ పాషా, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. రోడ్డేసి..

- దహెగాంలో రూ.1.20 లక్షలతో మరమ్మతులు చేపట్టిన యువకులు
- అభినందిస్తున్న గ్రామస్తులు

దహెగాంలో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న యువకులు

దహెగాం, సెప్టెంబర్12 : 'రోడ్డును బాగు చేయించండి సారూ..' అంటూ ఆ గ్రామ యువకులు అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించలేదు. చివరికి వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టి శభాష్ అనిపించుకున్నారు. దహెగాం మండల కేంద్రం నుంచి కల్వాడవైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. ఈ విషయమై ఇటీవల స్థానిక యువకులు ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో.. స్వయంగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి రూ. 1.20 లక్షలు జమ చేశారు. కంకర, సిమెంట్, ఇసుక తెప్పించారు. గురువారం దాదాపు 500 మీటర్ల వరకు రోడ్డుపైనున్న గుంతలను పూడ్చి వేసి బాగు చేశారు. ఇందుకు వారిని స్థానికులు అభినందించారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

- నస్పూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన
- కమిషనర్‌కు ఫిర్యాదు


నస్పూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీఎన్‌జీవోస్ ప్లాట్ల బాధితులు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 12 : నస్పూర్‌లోని సర్వే నంబర్ 42లో టీఎన్‌జీవోలకు కేటాయించిన భూమిలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని, నిర్మాణాలు నిలిపివేయాలని సొసైటీలో ప్లాట్లు పొందిన పలువురు బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నస్పూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సొసైటీ బాధ్యులు ఇష్టారాజ్యంగా ప్లాట్ నంబర్లు కేటాయిస్తున్నారని, ప్లాట్ల హద్దులు, ఫైనల్ పట్టా సర్టిఫికెట్లలో హద్దులు సరిచూసి వ్యత్యాసముంటే నిర్మాణాలు నిలిపివేయాలని కమిషనర్‌ను కోరారు. సొసైటీ వారు ఫైనల్ పట్టా సర్టిఫికెట్ల క్రమసంఖ్యను అనుసరించి ప్లాట్లు కేటాయించలేదన్నారు. క్రమసంఖ్యలో ఉన్న 81, 92, 119, 120, 131తో పాటు ముందున్న నంబర్ల వారికి ప్లాట్లు చూపకుండా అవకతవకలకు పాల్పడి, క్రమసంఖ్యలో లేని వారికి ప్లాట్లు కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా పారదర్శకంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. స్వచ్ఛంద పౌర సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ సీనియర్ నేత తుల మధుసూదన్‌రావుతో పాటు ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఎస్ ఆర్ బోస్, స్వచ్ఛంద పౌర సేవా సంస్థ అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, బల్ల శివశంకర్, సామాజిక కార్యకర్త నయీం మద్దతు ప్రకటించారు. కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఎంజీ కుర్షిత్, అహ్మద్ ఖాన్, పోచయ్య, బషీర్, అహ్మద్‌ఖాన్, రాజయ్య, అష్జల్ నబీ, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు